సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



**టన్ను చీనీ రూ.16 వేలు**

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేల చొప్పున ధర పలికాయి.



**కిలో టమాట రూ.16**

అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.10 చొప్పున ధర పలికాయి. మార్కెట్‌కు 3,150 టన్నుల టమాట వచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
30.6°/20.5°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.





## పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. పాత్రికేయులకు స్వేచ్ఛ ఇవ్వాలి. నిజాలను నిర్భయంగా రాసే వారిపై కేసులు నమోదు చేయడం సబబు కాదు. నాయకులు తెలియజేసిన విషయాలను కూడా పేపర్లలో రాయడం నేరమనడం హాస్యాస్పదం. అలాగే పోలీసు వ్యవస్థలో లోటు పాట్ల గురించి వాస్తవాలు రాస్తే పత్రిక యాజమాన్యంపై కేసులు నమోదు చేసి విచారణకు పిలిపించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. సాక్షిపై కేసు నమోదును తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు.

– మాలగుండ్ల శంకర నారాయణ, మాజీ మంత్రి

## జర్నలిస్టులపై అక్రమ కేసులు దుర్మార్గం



ఒక నాయకుడు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను పత్రికల్లో ప్రచురిస్తే చేస్తే కేసులు పెట్టడం దుర్మార్గం. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ కరువైపోయింది. నిజాయతీగా పనిచేసే జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గతంలో ఇలాంటి సాంప్రదాయం ఎప్పుడూ లేదు. కూటమి ప్రభుత్వంలో వాక్ స్వాతంత్ర్యంతో పాటు పత్రికా స్వేచ్ఛ కూడా ఎక్కడా కనిపించడం లేదు. రాష్ట్రం మరో బిహార్‌లా మారిపోయింది. ఏపీలో సామాన్యులకు కూడా భద్రత కరువైంది.

– ఉషశ్రీచరణ్, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

## న్యూస్‌రీల్

### సమాచారశాఖ ఏడీగా సీహెచ్ పురుషోత్తం



బాధ్యతలు స్వీకరిస్తున్న పురుషోత్తం

పుట్టపర్తి టౌన్: జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ సహాయ సంచాలకులుగా సీహెచ్ పురుషోత్తం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నంద్యాల జిల్లా డీఐపీ ఆర్‌ఓగా పనిచేస్తూ సహాయ సంచాలకులుగా జిల్లాకు వచ్చారు. ఇక్కడ ఏడీగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి డీడీగా పదోన్నతిపై నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఏడీగా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తంకు సమాచార శాఖ అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వెళ్లిన వేణుగోపాల్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఏడీ మాట్లాడుతూ జిల్లాలో పాత్రికేయుల సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

### నేరాల అదుపులో సీసీ కెమెరాల పాత్ర కీలకం



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా నేరాల అదుపులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ రత్న పేర్కొన్నారు. గురువారం పోలీస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు సీసీ కెమెరాలు, బోర్డు రూమ్, వీడియో కాన్ఫరెన్స్ హాల్ విభాగాన్ని ఎస్పీ రత్న సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ డీజీపీ, డీఐజీ సహకారంతో పాటు ప్రభుత్వ అనుమతితో ట్రంప్ షూలే పరిశ్రమ భాగస్వామ్యంతో పోలీస్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 2700 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కదిరి, హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో సబ్‌కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా కేంద్రంలో 345 మ్యాట్రిక్స్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో పెనుకొండ దర్మవరం, పుట్టపర్తిలో కూడా సబ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా అధునాతన సాంకేతికత పరిజ్ఞానంతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డీఎస్పీలు విజయకుమార్, ఆదినారాయణ, శ్రీనివాసులు, ఆర్‌ఐలు వలి, మహేష్, సీఐలు శ్రీనివాసులు, సోషియల్ మీడియా మోహన్, సీసీ చిరంజీవి, సోషియల్ మీడియా ఎస్‌ఐ మునిప్రతాప్, ఐటీ కో ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### మద్యం మత్తులో యువకుడి హల్‌చల్



మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్న యువకుడు

మడకశిర: పట్టణంలో మద్యం మత్తులో ఓ యువకుడు బుధవారం రాత్రి హల్‌చల్ చేశాడు. మద్యం సేవించి బీరు బాటిల్ పగులగొట్టి గాజు ముక్కలను చేతిలో పట్టుకుని వీధుల్లో వీరంగం సృష్టించాడు. పగులగొట్టిన బీరు బాటిల్‌తో ఊరు మారెమ్మ ఆలయ సమీపంలో రెచ్చిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అలాగే ఎస్‌బీఐ ప్రధాన రహదారిలో కూడా యువకుడు అర్ధనగ్నంగా తిరగడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. కోటవీధి, అమరాపురం రోడ్లలో యువకుడు హల్‌చల్ చేశాడు. అమరాపురం బస్టాండ్ సమీపంలోనే మద్యం షాపు ఉంది. ఈ మద్యం షాపులో మందు కొనుగోలు చేసి కొందరు యువకులు పూటుగా మద్యం తాగుతుండడంతో ఈపరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

### పాముకాటుతో మహిళా రైతు మృతి



మృతురాలు సరస్వతి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని ఓబుళనాయనపల్లికి చెందిన మహిళా రైతు సరస్వతి (55) గురువారం పాము కాటుతో మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. సరస్వతి తన పొలంలో కలుపు తీస్తుండగా కాలికి ఏదో కాటు వేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. సరస్వతికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# వైద్యం... దైవాధీనం



- జిల్లా వ్యాప్తంగా వైద్యుల కొరత
- భారీగా తగ్గిన నర్సులు, స్టాఫ్ నర్సుల సంఖ్య
- అరకొరగా అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు
- ఏ పీహెచ్‌సీలో చూసినా ఇదే పరిస్థితి
- 14 విభాగాల్లో ఏదో పోస్టు ఖాళీగా ఉన్న వైనం

వారం రోజుల క్రితం పుట్టపర్తి మున్సిపాలిటీ ఎనుములపల్లిలో ఉన్న పీహెచ్‌సీకి రాత్రి 9 గంటలకు జ్వరంతో బాధపడుతూ ఓ మహిళ వెళ్లింది. గేట్లకు తాళం వేసి ఉండటం చూసి పిలిస్తే.. ఓ నర్సు పలికింది. ఏం బాగాలేదో చెబితే మెడిసిన్ ఇస్తామని నర్సు చెప్పడంతో ఆస్పత్రి లోకి రానివ్వరా? అంటూ ఆమె ప్రశ్నించింది. నైట్ వాచ్‌మెన్ లేరని.. భద్రత దృష్ట్యా రాత్రి వేళ ఎవరినీ అనుమతించబోమని.. తెలిసిన వాళ్లను మాత్రమే అనుమతిస్తామని సమాధానం ఇచ్చింది. ఒక్కోసారి మద్యం మత్తులో కొందరు వచ్చి తలుపులు తీస్తున్నారని.. రక్షణ కరువైందని నర్సు వాపోయారు.

ఇలా ప్రతి పీహెచ్‌సీ లోనూ ఏదో పోస్టు ఖాళీ ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫార్మసిస్టులు, వాచ్‌మెన్లు లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ రోగులకు ఉపయోగపడటం లేదు.

సాక్షి, పుట్టపర్తి: జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. రోగులకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో వైద్య సేవలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వాతావరణంలో మార్పుల కారణంగా పల్లెలన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బాట పట్టాయి. అయితే అక్కడ డాక్టర్లు, నర్సులు, మిగతా సిబ్బంది సరిపడా లేకపోవడంతో వైద్యసేవలు స్తంభించాయి. ఆర్థిక స్తోమత లేనివారు గంటల తరబడి నిరీక్షించి వైద్యం పొందుతున్నారు. సీరియస్ కేసులైతే వెంటనే ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైద్య – ఆరోగ్యశాఖ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 14 విభాగాలు ఉంటాయి. ఏ పీహెచ్‌సీ పరిశీలించినా.. ఏదో విభాగంలో ఖాళీలు కనిపిస్తున్నాయి.

**వెంటాడుతోన్న జ్వరాలు..**

వాతావరణంలో మార్పులతో ఏ గ్రామంలో చూసినా జ్వరాలు విజృంభిస్తున్నాయి. సమీపంలోని పీహెచ్‌సీలకు వెళ్తే.. సిబ్బంది లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని.. ముందుగానే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 30 డెంగీ కేసులు తేలాయి. టైఫాయిడ్ జ్వరాల బాధితులు వీధికొకరు తేలుతున్నారు. డెంగీ కేసులు తేలిన ప్రాంతాల్లో మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారు. మిగతా చోట్ల పట్టించుకునే నాథుడే లేరు.



హిందూపురం జిల్లా ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు

**జిల్లాలోని పీహెచ్‌సీల సంఖ్య - 45**
**యూపీహెచ్‌సీల సంఖ్య - 18**

**తప్పుడు రిపోర్టులు..**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత వేధిస్తోంది. దీంతో రోగులకు రక్త పరీక్షలు ఇతర సిబ్బంది చేసి నివేదికలు ఇస్తున్నారు. సరైన గణాంకాలు తెలియక.. టైఫాయిడ్ సోకిందని చెబుతూ మందులు రాసిస్తున్న ఘటనలు సైతం వెలుగు చూశాయి. దీంతో రోగులు భయపడిపోతున్నారు. మరో ఆస్పత్రికి వెళ్తే.. వైరల్ ఫీవర్‌గానే చెబుతుండటంతో రోగులు తిరిగి పీహెచ్‌సీకి వెళ్లి అడిగితే.. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీ ఉందనే సమాధానం చెబుతున్నారు.

**కరువైన రక్షణ..**

ఓ వైపు మెడికల్ ఆఫీసర్ల కొరత.. మరికొన్ని చోట్ల నర్సుల సంఖ్య తక్కువగా ఉండటం.. ఇంకొన్ని చోట్ల సిబ్బంది ఉన్నప్పటికీ డిప్యూటేషన్ మీద మరో ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పరిస్థితులు చాలా చోట్ల ఉన్నాయి. అలాగే కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నైట్ వాచ్‌మన్ లేకపోవడంతో రక్షణ కరువైందని రాత్రి వేళల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఖాళీల వివరాలు**

| పోస్టు | ఉండాల్సింది | ఉన్నది | ఖాళీల సంఖ్య |
|---|---|---|---|
| మెడికల్ ఆఫీసర్లు | 104 | 87 | 17 |
| సీహెచ్‌ఓ లు | 31 | 22 | 09 |
| ఎంపీహెచ్‌ఓ లు | 44 | 28 | 16 |
| పబ్లిక్ హెల్త్ నర్సులు | 26 | 12 | 14 |
| సీనియర్ అసిస్టెంట్లు | 39 | 30 | 09 |
| స్టాఫ్ నర్సులు | 138 | 107 | 31 |
| ఫార్మసిస్టులు | 45 | 39 | 06 |
| హెల్త్ సూపర్‌వైజర్లు (మేల్) | 62 | 43 | 19 |
| హెల్త్ సూపర్‌వైజర్లు (ఫీమేల్) | 62 | 55 | 07 |
| జూనియర్ అసిస్టెంట్లు | 11 | 05 | 06 |
| ఎల్‌ఈ కంప్యూటర్లు | 12 | 07 | 05 |
| ల్యాబ్ టెక్నీషియన్లు | 47 | 42 | 05 |
| ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్‌లీ | 50 | 35 | 15 |
| ఆఫీస్ సబార్డినేట్లు | 44 | 30 | 14 |

### వైద్య సేవలు అందడం లేదు

నెల రోజుల వ్యవధిలో నాకు తెలిసిన వాళ్ల కోసం పలు ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చింది. ఎక్కడ చూసినా సిబ్బంది కొరత మాట వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిబ్బందిని తమకు కావాల్సిన స్థానాలకు డిప్యూటేషన్‌పై పంపించినట్లు చెబుతున్నారు. దీంతో చాలా ఆస్పత్రుల్లో ఉన్న వారితోనే పనులు చేయిస్తున్నారు. ఫలితంగా సకాలంలో వైద్య సేవలు అందడం లేదు.

– రామకృష్ణారెడ్డి, చిలమత్తూరు

### ఉన్నతాధికారులకు నివేదించాం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. అయితే ఏ ఆస్పత్రిలో కూడా వైద్య సేవలకు అంతరాయం కలగకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్న సిబ్బందితోనే సకాలంలో వైద్యసేవలు అందించే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే నియామకాలు చేపట్టి కొత్త వారిని తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

– ఫైరోజాబేగం, డీఎంహెచ్‌ఓ

### నూతన కలెక్టర్‌గా శ్యాంప్రసాద్



ప్రశాంతి నిలయం: జిల్లా నూతన కలెక్టర్‌గా ఎ.శ్యాం ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2016 బ్యాచ్ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్యాంప్రసాద్ ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, టెక్కలి ఆర్డీఓగా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న టీఎస్ చేతన్‌ను బదిలీ చేసినా, ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. నూతన కలెక్టర్ శ్యాంప్రసాద్ రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

### 27 మండలాల్లో వర్షం



చిలమత్తూరు మండలం శెట్టిపల్లి వద్ద జలకళను సంతరించుకున్న చిత్రావతి

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకూ జిల్లాలోని ధర్మవరంలో అత్యధికంగా 72.6 మి.మీ, తాడిమర్రి 52.52, రామగిరి 48.4, బుక్కపట్నం 38, తలుపుల 36.2, ఎన్‌పీకుంట 36, నల్లమాడ 36, సీకే పల్లి 35.2, పెనుకొండ 32.8, అమడగూరు 32.8, చిలమత్తూరు 31.8, కొత్తచెరువు 29.4, బత్తలపల్లి 28.4, కనగానపల్లి 26.2, పుట్టపర్తి 25.4, ఓడీచెరువులో 25.4 మి.మీ వర్షం కురిసింది. అలాగే ముదిగుబ్బలో 22.2 మి.మీ, కదిరి 17.8, సోమందేపల్లి 17.2, నల్లచెరువు 11.8, తనకల్లు 11.6, గాండ్లపెంటలో 9.6, రొద్దం 5.8, పరిగి 2.2, గోరంట్ల 2.2, హిందూపురం 1.4, లేపాక్షిలో 1.2 మి.మీ నమోదైనట్లు పేర్కొన్నారు. తుపాను ప్రభావంతో మరో రెండు రోజులు వర్షాలు కురవవచ్చన్నారు.

## మన్యం భక్తుల 'కళా నీరాజనం'



నృత్యరూపకంలోని ఓ సన్నివేశం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు.

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన పార్వతీపురం మన్యం జిల్లా భక్తులు గురువారం సాంస్కృతిక కళా నీరాజనంతో ఆకట్టుకున్నారు. చిన్నారుల నృత్య రూపకం అలరించింది. సంగీత కచేరీ అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం పురోగతిపై సమీక్ష సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 72,338 ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 28,240 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన 40,009 ఇళ్లలో 36,200 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అక్టోబర్ 15 నాటికి జిల్లాలో 9,984 ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని ఆ దిశగా ఇళ్లు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు.

**పారదర్శకంగా యూరియా పంపిణీ..**

జిల్లాలో పారదర్శకంగా యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో యూరియా పంపిణీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్లక్ష్యానికి తావులేకుండా యూరియా పంపిణీ సజావుగా జరిగేలా చూడాలన్నారు.

**చెరువులన్నీ నీటితో నింపాలి..**

జిల్లాలో ఉన్న చెరువులను నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని చెరువుల స్థితిగతులపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 15 చెరువులు పూర్తి నీటి సామర్థ్యంతో ఉన్నాయని, 75 శాతం సామర్థ్యంతో 17 చెరువులు ఉన్నాయని, 50 శాతం సామర్థ్యంతో 55 చెరువులు ఉన్నాయన్నారు. జిల్లాలో 284 చెరువుల్లో మోస్తరుగా నీరు ఉందన్నారు. మొత్తంగా 371 చెరువుల్లో నీరు ఉందన్నారు. జిల్లాలో 1186 చెరువుల్లోని 815 చెరువుల్లో నీరు లేదని, హంద్రీ–నీవా ద్వారా కృష్ణా నీటితో మరిన్ని చెరువులను నింపడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఉపాధ్యాయుల 'పోరుబాట'

- కూటమి ప్రభుత్వం సమస్యలు పట్టించుకోవడంలేదని ఆగ్రహం
- 15 నుంచి 19 వరకూ యూటీఎఫ్ నిరసనలు
- ఈ నెల 25న విజయవాడలో ప్రభుత్వంపై రణభేరి
- ఈ నెల 17 వరకూ ఏపీటీఎఫ్ నిరసన వారం



నల్లచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో టీచర్ల నిరసన

కదిరి: 'అధికారం ఇచ్చి చూడండి. ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ ఇస్తాం. పెండింగ్ బకాయిలన్నింటినీ ఒకేసారి ఇచ్చేస్తాం. సకాలంలో జీతాలు, పెన్షన్లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను చెల్లించే విధంగా ఏర్పాట్లు చేస్తాం. ఉద్యోగులకు పని భారం తగ్గిస్తాం' అంటూ ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు ఉద్యోగ, ఉపాధ్యాయులపై హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చిన పాపాన పోలేదు. దీంతో ఉపాధ్యాయ సంఘాలన్నీ కూటమి సర్కారుపై గుర్రుగా ఉన్నాయి. ఓపిక నశించడంతో ఉద్యమాలకు సిద్ధమయ్యాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) రణభేరి ప్రకటించింది. ఈ నెల 15 నుంచి 19 వరకూ ఉపాధ్యాయులు ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు బృందాలుగా పర్యటించనున్నారు. అప్పటికీ ప్రభుత్వంలో చలనం రాకపోతే ఈ నెల 25న విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**టీచర్లకే పరీక్ష..**

కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరిట విద్యారంగంలో తీసుకుంటున్న నిర్ణయాలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. విద్యాశాఖామంత్రి లోకేష్‌కు విద్యారంగంపై ఏమాత్రం అవగాహన లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల అభ్యసన మదింపు కోసం పెట్టే పరీక్షల మూల్యాంకణం ఇప్పుడు టీచర్లకే పరీక్షగా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే యోగాంధ్ర, మెగా పేరెంట్ .. టీచర్స్ మీటింగ్‌లతో పాటు వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయమని టీచర్లపై ప్రభుత్వం పెట్టిన ఒత్తిడి అంతా ఇంతా కాదు. ప్రధానంగా పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ బడుల వైపు మళ్లించే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మూడోవంతు ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. ఉన్నత పాఠశాలల్లో పని చేయాల్సిన టీచర్లను క్లస్టర్ టీచర్లుగా, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా మార్చేసింది. ట్రైనింగ్‌ల పేరుతో టీచర్లను బడికి దూరం చేయడమే కాకుండా బోధనేతర పనులతో టీచర్లను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. బదిలీలు. ప్రదోన్నతులు ముగిసి మూడు నెలలు పూర్తయినా ఇంకా కొందరు టీచర్లు పాత స్థానాల్లోనే పని చేస్తున్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యకు కూటమి ప్రభుత్వం నేటికీ పరిష్కారం చూపలేదు.

**డీఏలన్నీ పెండింగ్‌లోనే..**

టీచర్లకు న్యాయబద్ధంగా ప్రభుత్వం నుంచి అందాల్సిన వాటిపై కూటమి ప్రభుత్వం ఇప్పటికీ నోరు మెదపడంలేదు. ప్రతి సంవత్సరం జనవరి, జూలై మాసాల్లో అంటే ప్రతి ఆరు నెలలకోసారి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు కరవు భత్యం ప్రకటిస్తోంది. దాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం డీఏ ఇవ్వాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. 12వ పీఆర్‌సీని కూడా ప్రభుత్వం ఇంతవరకూ వేయలేదు. మధ్యంతర భృతి (ఐఆర్) ఊసే లేదు. సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) తీసుకొస్తామని హామీపై కూడా కూటమి సర్కారు నుంచి స్పందన లేదు.

### సర్కారుపై సమరమే



ఉపాధ్యాయ సమస్యలపై కూటమి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా ఉంది. అందుకే సమరమే సిద్ధమవుతున్నాం. ఈ నెల 15 నుంచి యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి బైక్ జాతా 17న జిల్లాలో పర్యటిస్తుంది. టీచర్లను బోధనేతర పనులకు దూరం చేయాలి. ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా పదోన్నతులు కల్పించాలి. పెండింగ్ డీఏలు తక్షణం ఇవ్వాలి. 12వ పీఆర్‌సీ ఏర్పాటుతో పాటు అంతవరకూ 29 శాతం ఐఆర్ ఇవ్వాలనేవి ప్రధాన డిమాండ్లు.

– శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

### మండల కేంద్రాల్లో నిరసనలు



ఉపాధ్యాయ సమస్యలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గురువారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యాం. 12న మండల కేంద్రాల్లో నిరసనలు, 13, 14 తేదీల్లో ప్రజా ప్రతినిధులకు వినతులు ఇవ్వడం, 15న డివిజన్ కేంద్రాల్లో, 16న జిల్లా కేంద్రాల్లో నిరసనలు, 17న ముఖ్యమంత్రితో పాటు సీఎస్‌లకు వాట్సాప్, ఈ–మెయిల్‌ల ద్వారా వినతులు ఇవ్వాలని నిర్ణయించాము.

– ఆది బయన్న, జిల్లా కార్యదర్శి, ఏపీటీఎఫ్

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి వర్సిటీ పోటీల్లో సత్తా చాటాలి



స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం: దక్షిణ భారతదేశ అంతర వర్సిటీ, జాతీయ స్థాయి పోటీల్లో జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థులు సత్తా చాటాలని ఆ వర్సిటీ వీసీ హెచ్.సుదర్శనరావు పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూ (ఏ)లో గురువారం నిర్వహించిన 16వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి, మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ క్రీడలను నిర్వహించే కాలేజీలను, క్రీడాభివృద్ధికి సంబంధించిన అంశాలను స్పోర్ట్స్ కౌన్సిల్‌కు వివరించారు. జాతీయ, దక్షిణ భారత అంతర వర్సిటీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వర్సిటీ తరఫున తగిన ఆర్థిక చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, డీఏపీ ఎస్వీ సత్యనారాయణ, డీఈ వి.నాగప్రసాదనాయుడు, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ బి.జోజిరెడ్డి, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ టి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పంట మార్పిడితో మెరుగైన ఫలితాలు

పుట్టపర్తి అర్బన్: పంట మార్పిడితో మెరుగైన ఫలితాలు ఉంటాయని, జిల్లాలో బోరు బావుల కింద పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలంటూ ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రామసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేరుశనగ సాగు చేసిన పొలంలో మొక్కజొన్న, మొక్కజొన్న సాగు చేసిన పొలంలో వేరుశనగ పంటలను సాగు చేయాలని సూచించారు. వరి సాగు చేసే నేలలో తరచూ అదే పంటను సాగు చేయకుండా పెసర, మినుము సాగు చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల భూసారం పెరిగి మంచి దిగుబడులు సాధించవచ్చునని పేర్కొన్నారు. సాగు ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు.

### 14న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

కదిరి అర్బన్: ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు విజయవాడ వేదికగా జరిగే 51వ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్లను ఈ నెల 14న కదిరిలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరమణ, సుహాసిని, హరీష్‌కుమార్ తెలిపారు. 20 ఏళ్ల లోపు వయసున్న బాలబాలికలు అర్హులు. బాలురు 75 కేజీలు, బాలికలు 65 కేజీలలోపు ఉండాలి. పూర్తి వివరాలకు 88862 30013లో సంప్రదించవచ్చు.

# ధరల పతనం.. రైతుల్లో అయోమయం



పెదపల్లి వద్ద రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న

దిగుబడులు బాగా ఉన్నా మార్కెట్‌లో సరైన ధరలు లేకపోవడంతో వేరుశనగ, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రోజుల వ్యవధిలోనే ధరలు పతనమవుతుండడంతో అయోమయంలో పడ్డారు.

- రోజుల వ్యవధిలో దిగజారుతున్న వేరుశనగ, మొక్కజొన్న ధరలు
- గిట్టుబాటు కావడం లేదంటున్న రైతులు

పుట్టపర్తి అర్బన్: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలు మిగులుతున్నాయని జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికి రాకముందు ఉన్న ధరలు దిగుబడి వచ్చిన తర్వాత గణనీయంగా తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తూ వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సేవా కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడంతో దళారుల చెప్పిందే వేదంగా మారింది. జిల్లాలో వ్యవసాయ బోరు బావులు ఉన్న రైతులు మొక్కజొన్న, వేరుశనగ పంటలను సాగు చేశారు. ఖరీఫ్‌లో వచ్చే ఆదాయాలపైనే కుటుంబ పోషణ, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, గృహ నిర్మాణాలు వంటి వాటిపైనే రైతులు ఆధారపడి ఉంటారు. ఇలాంటి తరుణంలో గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు చవిచూడక తప్పడం లేదు.

**పంట చేతికి రాగానే ధర పతనం..**

ఏటా పంట విక్రయాల్లో రైతులు దగా పడుతూనే ఉన్నారు. పంట చేతికి రాకముందు ఉన్న ధరలు.. పంట చేతికి వచ్చిన సమయానికి పూర్తిగా పడిపోతున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 45 కిలోల వేరుశనగ బస్తా రూ.3600తో అమ్ముడు పోయింది. మొక్కజొన్న క్వింటా రూ.3,800 వరకూ వ్యాపారులు కొనుగోలు చేశారు. గత నెలలో వేరుశనగ రూ.3,200, మొక్కజొన్న రూ.2,600తో వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం వేరుశనగ 45 కిలోల బస్తాను రూ.2,400 నుంచి రూ.3 వేలు, మొక్కజొన్న క్వింటా రూ.2 వేలతో కొనుగోలు చేస్తామంటూ వ్యాపారులు పేర్కొంటున్నారు. కే6 కాకుండా ఇతర నూతన రకం వేరుశనగను రూ.2 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. వేరుశనగ సాగుకు ఎకరానికి రూ.40 వేలకు పైగా, మొక్కజొన్న సాగుకు రూ.25 వేలకు పైగా ఖర్చు వస్తోందని, ఈ నేపథ్యంలో వ్యాపారులు అడిగిన ధరతో పంటను విక్రయిస్తే తమకు ఎంత మాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. రోజుల వ్యవధిలోనే ధరలు పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వేలాది మంది రైతులు మొక్కజొన్న, వేరుశనగ పంటలను తొలగించలేదు. పంటలన్నీ పూర్తయ్యే సమయానికి ఎంత మేర ధరలు పతనమవుతాయోనని ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పుట్టపర్తి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న వేరుశనగ

### 15 రోజుల్లోనే రూ.600 తగ్గింది



మొక్కజొన్న కోతలు మొదలు పెట్టే సమయంలో ఉన్న ధర కోత కాగానే లేకుండా పోయింది. 15 రోజుల వ్యవధిలోనే క్వింటా ధరలో రూ.600కు పైగా తగ్గింది. ప్రస్తుతం రూ.2 వేలకు కూడా కొనుగోలు చేయ లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే రబీలో పంటలు సాగు చేయడం కష్టం. – నాగభూషణ, రైతు, పెదపల్లి

### గిట్టుబాటు ధర కల్పించాలి



గత ఏడాది వేరుశనగ బస్తా రూ.3,800తో అమ్మాను. ప్రస్తుతం బస్తా రూ. 3 వేల లోపు అడుగుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరతో పంటను కొనుగోలు చేస్తే వ్యాపారుల ఆటలు సాగవు. ఖరీఫ్, రబీ కాలానికి ముందే గిట్టుబాటు ధరలు ప్రకటించాలి.

– నరసింహారెడ్డి, రైతు, వెంకటగారిపల్లి

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ కార్యదర్శిగా దేవరకొండ




దేవరకొండ రమేష్

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ కార్యదర్శిగా ధర్మవరం పట్టణానికి చెందిన దేవరకొండ రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు

## కలెక్టర్‌పై లోకాయుక్తకు ఫిర్యాదు

- రియల్టర్ రెడ్డెప్పశెట్టి అక్రమాలకు సహకరించారంటూ ఫిర్యాదు చేసిన ఆర్టీఐ కార్యకర్త





లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన ప్రతిని చూపుతున్న అంజనేయులు

చిలమత్తూరు: రియల్టర్ రెడ్డెప్పశెట్టి అక్రమాలకు సహకరించారంటూ కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ, తహసీల్దార్‌పై కర్నూలులోని లోకాయుక్త కార్యాలయానికి ఆర్టీఐ ప్రచార కార్యకర్త ఆంజనేయులు గురువారం ఫిర్యాదు చేశారు. బయటి ప్రాంతం నుంచి వచ్చిన రియల్టర్ రెడ్డెప్పశెట్టి స్థానిక రైతుల నుంచి వందలాది ఎకరాల భూమిని కొనుగోలు చేయడంతో పాటు నది, నదీ పోరంబోకు స్థలాలు, ప్రభుత్వ స్థలాలు, ఏపీఐఐసీ భూములను ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేసుకున్నాడన్నారు. పాలీహౌస్‌లు, ఫారం పాండ్లకు రూ. కోట్ల విలువైన సబ్సిడీ పొంది ప్రభుత్వాన్ని మోసం చేశాడన్నారు. అక్రమాలపై ''సాక్షి''లో వెలువడిన వరుస కథనాలపై స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమలు వాస్తవమని గుర్తించారన్నారు. ఉన్నతాధికారులు సైతం ఎవిక్షన్ నోటీసులు కూడా జారీ చేసి, చేతులు దులుపుకున్నారని, రియల్టర్‌కు దాసోహమంటూ ఆయనను కాపాడే ప్రయత్నం చేస్తున్నారంటూ లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

## బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పని సరి



మాట్లాతున్న మున్సిపల్ ఆర్డీ నాగరాజు

పెనుకొండ: బయో మెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని సచివాలయ సిబ్బందిని మున్సిపల్ ఆర్డీ నాగరాజు ఆదేశించారు. పెనుకొండలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టు 'ప్రోత్సాహకం' ఇవ్వండి

- సెంట్రల్ సిల్క్ బోర్డు జాయింట్ సెక్రటరీ నరేష్‌బాబును డిమాండ్ చేసిన పట్టు రైతులు





పట్టు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న నరేష్‌బాబు

మడకశిర: బైవోల్టిన్ పట్టు సాగు చేసిన రైతులకు ప్రోత్సాహక ధనాన్ని వెంటనే మంజూరు చేయాలని సెంట్రల్ సిల్క్ బోర్డు జాయింట్ సెక్రటరీ నరేష్‌బాబును పలువురు రైతులు డిమాండ్ చేశారు. సెరికల్చర్ టెక్నాలజీ బదిలీ ప్రచారంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధ్యక్షతన గురువారం మడకశిరలోని యాదవ కల్యాణమంటపంలో ఏర్పాటు చేసిన 'మేరా రేషం–మేరా అభిమాన్' కార్యక్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కార్యక్రమంలో నరేష్‌బాబు మాట్లాడుతూ... పట్టు పరిశ్రమలో ఆధునాతన సాంకేతిక పద్ధతుల ద్వారా ఉత్పత్తులను పెంచే అంశంపై పట్టు రైతులకు అవగాహన కల్పించారు. దేశ వ్యాప్తంగా కేంద్ర పట్టు మండలికి కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.4వేల కోట్లు కేటాయిస్తోందని, ఈ కేటాయింపును రూ.7,500 కోట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టు రైతు సంఘం జిల్లా నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, సిద్ధారెడ్డి, రామకృష్ణారెడ్డి, సోమ్‌కుమార్, శంకర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. బైవోల్టిన్ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహక ధనం ఇంత వరకూ అందించ లేదని, రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అందించాల్సిన ప్రోత్సాహక ధనం బకాయిలు రూ.70 కోట్ల వరకు ఉన్నాయన్నారు. తక్షణమే ప్రోత్సాహక ధనాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. రేషం షెడ్లపై సబ్సిడీని రూ.10లక్షల వరకు పెంచాలని కోరారు. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. అనంతరం వివిధ జిల్లాలకు చెందిన 30 మంది ఆదర్శ పట్టు రైతులు, రీలర్లను సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి, జిల్లా అధికారి శోభారాణి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, స్థానిక ఏడీఏ హనుమంతనాయక్, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జిల్లాలోని పట్టు రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



బోయ గిరిజమ్మను సన్మానిస్తున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జెడ్పీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి సెప్టెంబర్‌లోనే ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన ప్యానల్ రూపొందించిన నేపథ్యంలో గిరిజమ్మతో పాటు సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ సుబ్బయ్యను జెడ్పీ ఉద్యోగులు గురువారం ఘనంగా సన్మానించారు. ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, రత్నాబాయి, శ్రీవాణి, షబ్బీర్ నియాజ్, మహబూబ్ వలి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**గిరిజమ్మను కలిసిన పీఆర్ ఎస్‌ఈ**

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను పంచాయతీరాజ్ రాయలసీమ సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్(ఎస్‌ఈ) వై.చిన్నసుబ్బరాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడులో పని చేస్తూ పదోన్నతిపై అనంతపురం ఎస్ఈగా వచ్చిన ఆయన.. జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఛాంబర్‌లో చైర్‌పర్సన్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయనకు గిరిజమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సబ్ డివిజన్–1, 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లక్ష్మీనారాయణ, కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

# జక్కల ఆదిశేషుకు కన్నీటి వీడ్కోలు



నివాళులర్పిస్తున్న బీఎస్ మక్బూల్ అహ్మద్, నాయకులు



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, తదితరులు

- స్వగ్రామం బొంతలపల్లిలో ముగిసిన అంత్యక్రియలు

తనకల్లు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, నల్లమాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జక్కల ఆదిశేషు అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామం బొంతలపల్లిలో అశ్రునయనాల మధ్య జరిగాయి. కాగా, బొంతలపల్లికి గురువారం కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ చేరుకుని జక్కల ఆదిశేషు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కల ఆదిశేషు భార్య జెడ్పీటీసీ సభ్యురాలు జక్కల జ్యోతి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్, మాజీ ఎమ్మెల్యేలు దేశాయి తిప్పారెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్తఫా, పలువురు జిల్లా నాయకులు, మండల కమిటీ సభ్యులు తదితరులు జక్కల ఆదిశేషు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**'అనంత' నేతల నివాళి**

జక్కల ఆదిశేషు మృతదేహాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, పార్టీ అనంతపురం నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, అనంతపురం జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు అమరనాథరెడ్డి, గౌడ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కల లక్ష్మీనరసింహగౌడ్, బీసీ సంఘం ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్, కదిరి సాయి, జై గౌడ రాష్ట్ర నాయకులు రాజ్‌కుమార్, వాల్మీకి అంజి, పవన్, బెస్త వెంకటేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### నలుగురిపై చీటింగ్ కేసు నమోదు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని యర్రగుంటపల్లి వద్ద ఉన్న జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అజ్జుగుట్ట రాజశేఖర్‌రెడ్డి, మరో ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. రాజశేఖర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, మంజునాథ్, ఈశ్వరయ్య జగనన్న కాలనీలో ఒకటిన్నర సెంటు స్థలానికి పట్టా ఇప్పిస్తామంటూ కుటాగుళ్ల గ్రామానికి చెందిన జంగాల లక్ష్మి ని నమ్మించి రూ.75 వేలు తీసుకున్నారు. ఇదే తరహాలో మరి కొందరి నుంచి డబ్బు సుమారు రూ.4.8 లక్షలు వసూలు చేశారు. అనంతరం పట్టాలు ఇవ్వకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించిన బాధితులు నిలదీయడంతో బెదిరింపులకు దిగారు. దీంతో జంగాల లక్ష్మి ఫిర్యాదు మేరకు నలుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్

చిలమత్తూరు: స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో కట్టుకున్న భార్య లక్ష్మీదేవిని గొడ్డలితో నరికి చంపిన భర్త రాఘవేంద్రను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. కాగా, కాలనీ ఉన్న మద్యం బెల్టు షాపు కారణంగా ఇష్టారాజ్యంగా మద్యం సేవిస్తున్నారని, దీంతో మత్తులో భార్యలనుచంపే పరిస్థితులు వచ్చాయని స్థానికులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బెల్టుషాపు తొలగించాలని స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

### పార్సిల్ సర్వీసు సూపర్‌వైజర్‌పై కేసు నమోదు

కదిరి టౌన్: స్థానిక వాల్మో కొరియర్ పార్సిల్ సర్వీసు సూపర్‌వైజర్ విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. మూడు రోజులుగా కొరియర్ సేవలకు సంబంధించిన రూ.1.80 లక్షలను సంస్థ బ్యాంక్ ఖాతాలోకి జమచేయకుండా సొంతానికి వాడుకుని మోసం చేశాడంటూ పార్సెల్ సర్వీసు బ్రాంచ్ మేనేజర్ షేక్ సాదిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద మృతి



హిందూపురం: మండలంలోని అప్పలకుంట గ్రామంలో 50 ఏళ్ల లోపు గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తూమకుంటలోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న శేషాపురానికి చెందిన చక్కిరరెడ్డి రెండు రోజుల క్రితం ఆమెను పిలుచుకొచ్చినట్లుగా గుర్తించారు. ఇరువురూ కలిసి రెండు రోజులు ఉన్నారని, ఆమె చనిపోవడంతో మృతదేహాన్ని ఇంట్లోనే వదిలేసి చక్కిరరెడ్డి వెళ్లిపోయినట్లుగా విచారణలో వెల్లడైంది. మృతురాలు ఎవరు? ఏ ఊరు అనేది తెలియరాలేదు. ఆమె శరీరంపై ఎలాంటి గాయాలూ లేవు. సాధారణ మరణంగానే కనిపిస్తోందని పోలీసులు పేర్కొన్నారు. మృతురాలి సంబంధీకులు ఎవరైనా ఉంటే 95407 96847, 94405 80681కు సమాచారం అందించాలని కోరారు.

### గ్రామాల్లో పారిశుధ్య పనులు



మురుగుపై బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పెనుకొండ రూరల్: గ్రామాల్లో పేరుకుపోయిన అపరిశుభ్రత కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్న అంశంపై 'విషజ్వరాల విజృంభణ' శీర్షికన గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై వైద్య, ఆరోగ్య శాఖ స్పందించింది. పెనుకొండ మండలం తిమ్మాపురంలో గురువారం వైద్య సిబ్బంది పర్యటించి ఇంటింటా లార్వా సర్వే చేపట్టారు. మురుగు గుంతలలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. దోమకాటు వ్యాధులపై ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో సిబ్బంది గోపీ నాయక్, జనార్దన రెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: విశ్వకర్మ యోజన పథకం కింద అందించే రుణాలకు ఉమ్మడి జిల్లాలోని ముస్లిం, దూదేకుల, క్రిస్టియన్ మైనార్టీల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మైనార్టీ కార్పొరేషన్ ఈడీ జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. చేతివృత్తిదారులు, స్వర్ణకారులు, కార్పెంటర్లు, శిల్ప కళాకారులు, కొలిమి.. బుట్టలు.. చాపలు.. పరకలు అల్లేవారు, చెప్పులు కుట్టేవారు, రజక, కుమ్మరి, టైలర్లు, తాపీ కార్మికులు, బార్బర్లు, రాళ్లు కొట్టువారు, బొమ్మలు, పూలదండలు, తాళాలు తయారీదారులు అర్హులు. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తారు. రుణాలు పొందిన వారు 5 శాతం వడ్డీతో బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. గత ఐదేళ్లలో పీఎంఈజీపీ, సీఎం స్వానిధి, ముద్రా రుణాలు పొందిన వారికి ఈ పథకం వర్తించదు. స్థానిక మీ సేవా కేంద్రాలు లేదా www.pmvishwakarma.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

### యువతి బలవన్మరణం

హిందూపురం: మండలంలోని కొటిపి గ్రామ ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మంజునాథ్ కుమార్తె ఉషారాణి (19) ఆత్మహత్య చేసుకుంది. ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఇంటి పట్టునే ఉంటున్న ఆమె కడుపు నొప్పి తాళలేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఆటోను ఢీకొన్న లారీ

- ఎనిమిది మంది మహిళా కార్మికులకు గాయాలు

హిందూపురం: స్థానిక మణేసముద్రం మార్గంలో ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది మహిళా కార్మికులు గాయపడ్డారు. కొల్లకుంట, కేతిగాని చెరువు, మణేసముద్రం గ్రామాలకు మహిళా కార్మికులు కర్ణాటకలోని గౌరిబిదనూర్ సమీపంలోని జాకీ గార్మెంట్స్ పరిశ్రమలో గురువారం రాత్రి విధులు ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. మణేసముద్రం సమీపంలోకి చేరుకోగానే వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఆటో డ్రైవర్‌తో పాటు నాగమణి, లక్ష్మీదేవి, ఉమాదేవి, కీర్తన, అనుపమ, మరో నలుగురు కార్మికులు గాయపడ్డారు. అప్రమత్తమైన స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 ద్వారా జిల్లాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**లారీ డ్రైవర్‌కు దేహశుద్ధి**

సోమందేపల్లి: హిందూపురం రూరల్ మండలం మణేసముద్రం వద్ద ఆటోను ఢీకొన్ని 8 మంది మహిళా కార్మికులు గాయపడడానికి కారణమైన లారీ డ్రైవర్‌ను గురువారం రాత్రి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విచారణలో హిందూపురం పట్టణ సమీపంలోని కొట్నూరు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొని మణేసముద్రం వరకూ లారీ ఈడ్చుకెళ్లిందని గుర్తించారు. అదే సమయంలో గార్మెంట్స్ పరిశ్రమలో విధులు ముగించుకుని తిరుగు ప్రయాణమైన మహిళా కార్మికుల ఆటోను ఢీకొన్నట్లుగా నిర్ధారణ అయింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీని ఆపకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా ముందుకెళ్లిపోయాడు. దీంతో క్షతగాత్రుల బంధువులు లారీని వెంబడిస్తూ చాలకూరు సమీపంలో అడ్డుకుని, డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం హిందూపురం నుంచి వచ్చిన పోలీసులకు అప్పగించారు.